క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ ఏఎస్ఆర్ నగర్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏఎస్ఆర్ నగర్, వోల్వో ఆఫీస్, మైత్రి ఇన్ఫ్రా ప్రాంతం, వుడా చిల్డ్రన్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మద్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ ఈపీఎఫ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మద్రిపాలెం వుడా లేఅవుట్, మెహర్ మార్గ్, లీడర్ ప్రెస్, ఈపీఎఫ్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ఏయూక్యాంపస్: సమైక్య భారతి, బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ బీచ్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు బుధవారం ఉదయం గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 60 మంది విద్యార్థులు 8 గ్రూపులుగా పోటీలో పాల్గొన్నారు. వర్తమాన అంశాలు, ఆర్థిక, భూగోళ వైజ్ఞానిక, చరిత్ర సంస్కృతి, కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులు సంధించారు. ఎనిమిది రౌండ్లలో జరిగిన పోటీలో మొత్తం 60 ప్రశ్నలు టీమ్ సభ్యులను అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. పోటీ విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

లలితా పీఠంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో ఫల్గుణ మాసం, బహుళ అష్టమి సందర్భంగా బుధవారం వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా ఈ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ నెల 20న కాశీ కాలభైరవులకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమావాస్య సందర్భంగా 21న శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం జరుపుతామని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కళావిహీనం..!



పాడైన ఇనుప పరికరాలు

- దీనస్థితిలో ఇందిరా గాంధీ పార్కు
- పర్యవేక్షణ లోపంతో తుప్పు పట్టిన పరికరాలు
- ఆధునికీకరించాలని స్థానికుల విజ్ఞప్తి



నక్కవానిపాలెంలో ఇందిరా గాంధీ పార్కు దుస్థితి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ ఉద్యాన వనం దీనస్థితిలో ఉంది. నిర్వహణ కరువై పచ్చదనం లేక కళావిహీనంగా తయారైంది. కొన్నేళ్లుగా ఈ పార్కు పర్యవేక్షణను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మిగిలింది. పార్కులో ఉన్న ఆట వస్తువులు, ఇనుప పరికరాలు తుప్పు పట్టి పాడయ్యాయి. ఉద్యానవన నేమ్ బోర్డు అధ్వానంగా తయారై అక్షరాలు కనుమరుగయ్యాయి. 1985లో నక్క రామకృష్ణారెడ్డి కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఈ పార్కు నిర్మాణం చేపట్టారు. 1993 అక్టోబర్ 19న నాటి రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్య నారాయణ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి బలిరెడ్డి సత్యారావు, ఇందిరా గాంధీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు నక్క రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇందిరా గాంధీ ఉద్యానవనం పేరిట నక్కవానిపాలెం సెంటర్‌లో పార్కును ప్రారంభించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కాలక్రమేణ ఈ పార్కు ఉనికిని కోల్పోతూ వస్తోంది. నిర్వాహకులు లేకపోవడంతో ఎప్పుడూ చూసిన తాళం వేసే ఉంటోంది. పర్యవేక్షణ కరువై సాయంత్రం వేళ స్థానికులు కూర్చోడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. పార్కులోని ఆట వస్తువులు, పరికరాలన్నీ పాడైపోవడంతో ఘోరంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి ఇందిరా గాంధీ ఉద్యానవనానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా అభివృద్ధి చేయాలని నక్కవానిపాలెం వాసులు కోరుతున్నారు.

పూర్వ వైభవం తీసుకురండి

మా ప్రాంతంలోని ఇందిరా గాంధీ పార్కు నిరుపయోగంగా మిగిలింది. పార్కులోని పరికరాలన్నీ పాడయ్యాయి. సాయంత్రం వేళ సేదతీరేందుకు స్థానికులకు అవకాశం లేకుండా పోయింది. అధికారులు స్పందించి పార్కును ఆధునికీకరించాలి.

– సీహెచ్ సంతోష్, నక్కవానిపాలెం

పార్కును అభివృద్ధి చేస్తాం

ఈ నెల విశాఖలో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో వచ్చే నెలలో పార్కు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. నక్కవానిపాలెం ఇందిరా గాంధీ ఉద్యానవవానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

– విజయలక్ష్మి, జోన్-3 కమిషనర్, జీవీఎంసీ

ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



బుల్లయ్య కళాశాల వద్ద విద్యార్థుల సందడి



శ్రీవిశ్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల నిరీక్షణ

విద్యార్థులతో సందడిగా పరీక్ష కేంద్రాలు

సీతంపేట: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫైనల్ పరీక్షలు బుధవారం ప్రారంభయ్యాయి. ఉత్తర నియోజకవర్గంలోని పలు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని ఇంటర్మీడియట్ బోర్డు హెచ్చరించిన నేపథ్యంలో విద్యార్థులు ఉదయం 7.30 గంటలకే సెంటర్లకు చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. సీతంపేట పరిధిలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, శ్రీవిశ్వ కళాశాల, చైతన్య కళాశాలలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు

సీతమ్మధార: సీతమ్మధారలోని శ్రీ నవోదయ జూనియర్ కాలేజీలో తొలి రోజు నిర్వహించిన పరీక్షకు 226 మంది విద్యార్థులకు గానూ ముగ్గురు హాజరు కాలేదు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



హాల్ టికెట్ నంబర్ చూస్తున్న స్టూడెంట్లు



సీతమ్మధారలో పరీక్ష రాసి బయటకు వస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

క్లాత్ బ్యాగులే మేలు



సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి



పండ్ల దుకాణాల వద్ద కవర్లు పరిశీలిస్తున్న జెడ్సీ

సీతమ్మధార: ప్లాస్టిక్, పాలిథిన్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడటం మంచిదని జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి సూచించారు. సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం ప్లాస్టిక్ సంచులను నిషేధించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రతి కూరగాయల స్టాల్ వద్దకు ఆమె వెళ్లి ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వినియోగం హానికరమన్నారు. వాటిని సరిగ్గా పారవేయకపోతే కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయి అపరిశుభ్రత వాతావరణాన్ని తద్వారా వ్యాధులను కలుగజేస్తాయని చెప్పారు. పర్యావరణానికి మేలు చేసేలా ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులు వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రైతుబజార్ ఆవరణలోని పండ్ల దుకాణాల్లో వినియోగిస్తున్న సంచులను జెడ్సీ విజయలక్ష్మి పరిశీలించి. గుడ్డ సంచులనే వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండ బాబు, సహాయకుడు సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

హయ్యర్ పింఛన్ చెల్లించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్

మురళీనగర్: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కనీస పింఛన్ చెల్లింపు విధానాన్ని అమలు చేయాలని హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బూసి ప్రసాద్ డిమాండ్ చేశారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగి పదవీ విరమణ చేసిన నాటి జీతాన్ని పరిగణనలోకి తీసుకుని పెన్షన్ చెల్లించాలన్నారు. కనీస పింఛన్ రూ.9000 ఉండాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి కె.సుధాకర రావు మాట్లాడుతూ హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం



పరీక్ష కేంద్రంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న కమిషన్ చైర్మన్ అప్పారావు, సభ్యుడు సీతారాం

సీతంపేట: ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, వైద్య సేవలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాల్సిందేనని కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఇంటర్ ఫస్టియర్ పరీక్ష ప్రారంభానికి గంట ముందు సీతంపేటలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో కల్పించిన వసతులను ఇంటర్మీడియట్ ఆర్ఐవోతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం అప్పారావు, సీతారాంలు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ట్రాఫిక్ సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీని వల్ల పరీక్ష రాసే అవకాశం కోల్పోయే ప్రమాదముందన్నారు. ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పోలీస్, రవాణా అధికారులకు కమిషన్ ఆదేశాలు జారీ చేస్తుందని చెప్పారు. పరీక్ష కేంద్రంలో నియమించిన వైద్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్ప ఎటువంటి అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్ లేకపోవడాన్ని గుర్తించారు. దీని వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సేవలందించడానికి తగిన సిబ్బంది, అత్యవసర మందులు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి వారు సూచించారు. ఆర్ఐవోపీ ఉమారాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్, తిక్కవానిపాలెం సచివాలయాల పరిధిలో క్లాత్ బ్యాగ్‌ల వినియోగం, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, డెంగ్యూ జ్వరాల విజృంభనపై బుధవారం జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణాన్ని కాపాడాలని వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివారణ చర్యలతోనే డెంగ్యూ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, దోమల నిర్మూలనపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డులో ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు జెడ్సీకి ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోన్-5 శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, శానిటరీ, మలేరియా సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రైతులకు రాయితీలు



మాట్లాడుతున్న బులిక్రిష్ణ

సీతమ్మధార: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం సీతమ్మధార రైతుబజార్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్‌రావు, నందాజీ, ఫుడ్ సేఫ్టీ డిప్యూటీ కంట్రోలర్ బి.మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ బి.కె.వరప్రసాద్, జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ మద్రి సత్యనారాయణ, ఈవో కొండ బాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని అంతమొందిద్దాం



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రం వద్ద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ శశిప్రియాంక



కప్పరాడ ఆరోగ్య కేంద్రం వద్ద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్లు రాజేంద్ర, సువర్ణ ప్రియాంక

కంచరపాలెం: కప్పరాడ-బాపూజీనగర్, కంచరపాలెం-ఆర్పీ పేట వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో సైకిల్ ర్యాలీలు చేశారు. వీటిని ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక, డాక్టర్ నసపల రాజేంద్ర, డాక్టర్ సువర్ణ ప్రియాంక ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పేరిట అవగాహన చేపట్టినట్లు తెలిపారు. ఆర్పీ పేట ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ పీఆర్‌వో ఎస్.పైడిరాజు, టీబీ సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, అమృత స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

భాషా పటిమ అవసరం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: రచయితలకు పరిశీలనాశక్తి, గ్రంథపఠనం, భాషా పటిమ అవసరమని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో సాహిత్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహృదయ సాహితి కవులు, రచయితల సాహిత్య చర్చలకు మంచి వేదిక అన్నారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇటువంటి సాహిత్య చర్చలు కవులు, రచయితలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు జాతీయాలు, నుడికారం అనే అంశంపై సిహెచ్.చినసూర్యనారాయణ, నంది తిమ్మన పారిజాతాపహరణంపై టీపీఎస్ ఆచార్యులు, స్త్రీవాద సాహిత్యంపై బి.సరోజిని, మల్లాది వెంకటకృష్ణమూర్తి నవలలపై కుప్పిలి భీమేశ్వరరావు, పంచతంత్రంపై కె.జి.వేణు, తెలుగులో లఘు కవితా రీతులపై శేఖరమంత్రి ప్రభాకర్ ప్రసంగించారు. ముందుగా ప్రజా స్పందన అధ్యక్షుడు సి.ఎస్.రావు మృతికి సంతాపం ప్రకటించి మౌనం పాటించారు.

తైక్వాండో జాతీయ పోటీలకు మధురవాడ క్రీడాకారులు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల యలమంచిలిలో సబ్ జూనియర్ క్యాడెట్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. వీటికి మధురవాడ నుంచి 14 మంది క్రీడాకారులు హాజరుకాగా 10 మంది బంగారు, ఒకరు కాంస్య పతకం సాధించారు. వీరిలో 10 మంది ఈ నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మధురవాడ యూత్ తైక్వాండోకు చెందిన జి.భాషిత, ఎ.నిత్యశ్రీ, పి.జ్ఞానశ్రీ, కె.ధనలక్ష్మి, కె.మహేశ్వరరావు, పి.సుధీర్, ఎన్.విశాల్, పి.జశ్వంత్ సాయిసూర్య, ఎ.వివేక్ అభిసాయి, టి.మణికంఠ బంగారు పతకాలు గెలుచుకున్నారు. వీరిని మధురవాడకు చెందిన శ్రీ కనక దుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయిర్స్ నిర్వాహకులు కొర్రాయి సురేష్ ఆర్మ్ గార్డ్స్, చెకెస్ గార్డ్స్ బుధవారం బహూకరించారు. విజేతలను మధురవాడ యూత్ తైక్వాండో కోచ్‌లు సురేష్, సుకుమార్, సంపత్ తదితరులు అభినందించారు.

రేపటి నుంచి యోగా ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న నాగశర్మ

మద్రిపాలెం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ నెల 17, 18, 19 తేదీల్లో యోగా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు శ్రీరామచంద్ర మిషన్ విశాఖ మెట్రో జోన్ జోనల్ కో ఆర్డినేటర్ వి.ఆర్.ఎస్.నాగశర్మ తెలిపారు. మద్రిపాలెం ఆర్ అండ్ బీ దరి ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలోని రామచంద్ర మిషన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శ్రీరామచంద్ర మిషన్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు రామచంద్ర మిషన్ ఆశ్రమంలో జరుగుతాయని చెప్పారు. అంతర్గత ఆనందం, శాంతి, సమగ్ర వికాసాన్ని సాధించడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. యోగాసనాలు, ముద్రలు, ప్రాణాహుతి ప్రసారంతో కూడిన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ విభాగం ఆధ్వర్యంలో యోగాసనాలు నేర్పిస్తూ ఒత్తిడి, బీపీ, సుగర్, ఊబకాయం, థైరాయిడ్ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి తగు సూచనలు ఇస్తారని తెలిపారు. ధ్యానానికి సంబంధించి 'హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్' అనే భారత్ ఇనీషియేటివ్ ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ధ్యానం చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తారన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ద్వారా 165 దేశాల్లో అనేక మంది ధ్యాన సాధన చేస్తున్నారని, 16 వేల మంది ప్రశిక్షకులు అహర్నిశలూ ఉచితంగా ఈ సేవలందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జోన్-2 డీసీపీ ఆనందరెడ్డి, అడ్మిరల్ ఏవై సర్దేసాయ్, పలువురు అధికారులు, ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని నాగశర్మ కోరారు.

కోరాపుట్–కొత్తవలస లైన్‌లో తనిఖీలు



శివలింగపురం స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఎం మనోజ్ శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ రెండో రోజు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల కోరాపుట్ – కొత్తవలస లైన్లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలో కోరాపుట్, అరకు, బొర్రా గుహలు, శివలింగపురం స్టేషన్ల మధ్య సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, స్టేషన్లను తనిఖీ చేశారు. విండో ట్రెలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కోరాపుట్ – కొత్తవలస సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనులు, కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో గల రన్నింగ్ రూం, రెస్ట్ హౌస్‌లను పర్యవేక్షించారు. అనంతరం రన్నింగ్ రూంలో లోకో పైలట్స్, ట్రెన్ మేనేజర్స్‌తో మాట్లాడారు. అరకు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్ – వన్ ప్రాడక్ట్ స్టాల్‌ను, రెస్ట్‌హౌస్‌లను కూడా పరిశీలించారు. అమృత్‌భారత్ పథకం కింద ఈ స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. చిమిడిపల్లి వద్ద గల టన్నెల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇటీవల గూడ్స్ రైలు ప్రమాదం జరిగిన శివలింగపురం యార్డ్‌ని పరీక్షించారు. పర్యటనలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

తాటిచెట్లపాలెం: రాహుల్ గాంధీ నాయకత్వంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. రైల్వే న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన యువజన కాంగ్రెస్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 200 మందికి విశాఖ కేంద్రంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నటుల తెలిపారు. పార్టీలో పూర్తి ప్రక్షాళన జరుగుతుందని, 50 శాతం పదవులు 50 ఏళ్లలోపు వారికి, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలని ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సమావేశాల్లో నిర్ణయించినట్లు చెప్పారు. యువత ద్వారా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, దాని కోసమే ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు రుద్రరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామారావు, గొంపా గోవిందరాజు, హైదర్ ఆలీ సింకా, రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు భవిష్యత్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ప్రైవేటీకరణ తప్పదని ప్రకటించిన నేపథ్యంలో బుధవారం సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు పెద్ద సంఖ్యలో లేఖలు రాశారు. ప్రైవేటీకరణ ప్రత్యామ్నాయం, సెయిల్‌లో విలీనం, వాటి ఉపయోగాలు, ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ లక్ష్య సాధన, ఉద్యోగాల కల్పన, రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉక్కు సామర్థ్యం పెంపు గురించి లేఖల్లో వివరించారు. స్టీల్‌ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.కె.రావు మాట్లాడుతూ సెయిల్ నుంచి విడదీసిన విశాఖ ఉక్కును తిరిగి విలీనం చేయడం ద్వారా లాభదాయకమైన ఉత్పాదనకు దోహదపడుతుందన్నారు.